యథేచ్ఛగా ట్రాఫిక్ ఉల్లంఘనలు

- ప్రమాదాల బారిన పడుతున్న వైనం
- ముమ్మరంగా జరిమానాలు, అవగాహన కార్యక్రమాలు
- అయినా మారని తీరు..



ట్రిపుల్ డ్రైవింగ్ చేస్తున్న ద్విచక్రవాహనదారులు



నంబర్ ప్లేట్ సరిగాలేని వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న భద్రాచలం ట్రాఫిక్ పోలీసులు (ఫైల్)

భద్రాచలంఅర్బన్: ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని పోలీస్, రవాణా శాఖ అధికారులు పదేపదే చెబుతున్నా వాహనదారుల్లో మార్పు కనిపించడం లేదు. సదస్సులు నిర్వహించి అవగాహన కల్పిస్తున్నా కొద్ది మంది మాత్రమే స్పందిస్తున్నారు. రోడ్డు నిబంధనలు ఉన్నవి ఉల్లంఘించడానికే అన్నట్లు చాలా మంది వ్యవహరిస్తున్నారు. జరిమానాలు విధిస్తున్నా మామూలే అన్నట్లు చూస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈ ఏడాది జనవరి నుంచి ఏప్రిల్ దాకా భద్రాచలం ట్రాఫిక్ పోలీసులు 18,251 మందిపై కేసులు నమోదు చేయగా, వారికి రూ.30లక్షల 79వేల 400ల జరిమానా విధించారు.

ట్రిపుల్ రైడింగ్‌తో వర్రీ..

ఎక్కువగా కళాశాల స్థాయి యువకులు ట్రిబుల్ రైడింగ్ చేస్తున్నారు. తల్లిదండ్రులు వారికి అవగాహన కల్పించకపోవడం ముఖ్య కారణం. కళాశాలలు, పాఠశాలల్లో ప్రత్యేక అవగాహన సదస్సులు నిర్వహిస్తూ యువకులకు పోలీసు శాఖ అవగాహన కల్పిస్తోంది. ఎవరైనా పట్టుబడితే తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సెలింగ్ ఇస్తున్నారు. జనవరి నుంచి ఏప్రిల్ దాకా భద్రాచలం పట్టణంలో ట్రిపుల్ రైడింగ్ చేస్తున్న 140 మందిపై కేసులు నమోదు చేయగా, వారికి రూ.1.68 లక్షల జరిమానాను పోలీసులు విధించారు.

పెరుగుతున్న మైనర్ల డ్రైవింగ్

పిల్లలకు ఎలాంటి లోటు లేకుండా చూడాలన్న ప్రేమతో తల్లిదండ్రులు ద్విచక్ర వాహనాలు సైతం ఇస్తున్నారు. రోడ్డు భద్రత గురించి, ట్రాఫిక్ నిబంధనలు తెలియని మైనర్లు అతి వేగంగా నడుపుతూ ప్రమాదాల బారిన పడుతున్నారు. వాహనం నడిపే సామర్థ్యం ఉందని, వాహనాన్ని నియంత్రించగల మనే అతి నమ్మకం వారిని ప్రమాదాలకు గురయ్యేలా చేస్తోంది. ఈ ఏడాది జనవరి నుంచి ఏప్రిల్ దాకా భద్రాచలంలో ఇలా డ్రైవింగ్ చేస్తున్న 19 మందిపై కేసులు నమోదయ్యాయి. ఇందుకు సంబంధించి రూ.9,500 వరకు జరిమానాలు విధించారు. పట్టుబడిన మైనర్లతో పాటు వారి తల్లిదండ్రులపై చర్యలు తీసుకునేలా చట్టం, నిబంధనలు ఉన్నాయి.

సెల్‌ఫోన్ మాట్లాడుతూ..

పని ఒత్తిడి కారణంగా సమయం వృథా ఎందుకని భావించి కొందరు వాహన డ్రైవింగ్‌లోనే సెల్ఫోన్ మాట్లాడుతూ ప్రమాదాలబారిన పడుతున్నారు. ఇటీవల భద్రాచలానికి చెందిన ఓ వ్యక్తి ఈ మధ్య కాలంలో సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేశాడు. గేదెను తప్పించబోయి వాహనాన్ని అదుపు చేయలేక కిందపడి గాయాలపాలయ్యాడు. ఇలా ఎందరో ప్రాణాలమీదికి తెచ్చుకుంటున్నారు. సెల్‌ఫోన్ మాట్లాడుతూ మూడుసార్లు పట్టుబడిన తర్వాత మళ్లీ అదే ఉల్లంఘనకు పాల్పడితే పోలీసు శాఖ లైసెన్స్ రద్దు సిఫారసుకు కసరత్తు చేస్తోందనే వార్తలు వస్తున్నాయి. ఇలా మొబైల్ వాడుతూ నాలుగు నెలల్లో 16 మందిపై పోలీసులు కేసు నమోదు చేయగా, వారికి రూ.16 వేల వరకు జరిమానా విధించారు.

హెల్మెట్‌పై అశ్రద్ధ..

హెల్మెట్ పెట్టుకుంటే జుట్టు ఊడిపోతుందని, కొందరు తలపై అదనపు భారం అనే అపోహతో ధరించడం లేదు. హెల్మెట్ తప్పనిసరి అంటూ పోలీసులు అవగాహన కల్పించడంతో పాటు ధరించని వారికి తరచూ జరిమానాలు విధిస్తున్నారు. ఈ ఏడాది జనవరి నుంచి ఏప్రిల్ వరకు సుమారు 11వేల 473 మందిపై కేసులు నమోదు చేయగా, వారికి రూ.20లక్షల 29వేల 300లు జరిమానాగా విధించారు.

డ్రంకెన్ డ్రైవ్..

లారీ, ఆటోడ్రైవర్లు కొందరు మద్యం మత్తులో వాహనాలు నడుపుతున్నారు. మద్యం మనతోపాటు ఎదుటివారి ప్రాణాలను ప్రమాద రూపంలో బలిగొంటుదన్న విషయాన్ని వాహనచోదకులు గమనించాలి. పోలీసులు రాత్రివేళ డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు చేస్తూ ప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తున్నారు ఇలా గడిచిన నాలుగు నెలలో దాదాపు 499 కేసులు నమోదైనట్లు పోలీసులు తెలిపారు. ఇలా నిబంధనలు ఉల్లంఘించిన వారిపై జరిమానాలు విధిస్తున్నప్పటికీ వాహనదారుల్లో పెద్దగా మార్పు కనిపించడం లేదు. వాహనదారులు స్వచ్ఛందం నిబంధనలు పాటించాల్సి ఉంది.

అతిక్రమిస్తే చర్యలు తప్పవు



ట్రాఫిక్ నిబంధనలు పాటించని వారిపై చర్యలు తప్పవు. నిబంధనలపై వాహనదారులకు అవగాహన కల్పించే కార్యక్రమాలు నిరంతరం జరుగుతున్నాయి. నంబర్ ప్లేట్ లేకుండా వాహనాలు నడపకూడదు. పదే పదే ఉల్లంఘనలకు పాల్పడే వారు తనిఖీల్లో పట్టుబడితే జరిమానాలు, కఠిన చర్యలు ఉంటాయి.

– పీవీఎస్ రావు, ట్రాఫిక్ ఎస్సై, భద్రాచలం

బేషరతుగా కొనుగోలు చేయాలి



ములకలపల్లి: తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న సత్యనారాయణ

ములకలపల్లి: అకాల వర్షాలకు తడిసిన ధాన్యాన్ని బేషరతుగా కొనుగోలు చేయాలని తెలంగాణా రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అన్నవరపు సత్యనారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని ధాన్యం కల్లాలను గురువారం సందర్శించారు. తడిసిన ధాన్యాన్ని పరిశీలించి, రైతులతో మాట్లాడారు. తేమ, తాలు అంటూ కొర్రీలు పెట్టకుండా వడ్లను త్వరితగతిన మిల్లులకు తరలించాలని అన్నారు. సంఘ జిల్లా కమిటీ సభ్యుడు గడ్డం వెంకటేశ్వర్లు, బైరు ప్రసాద్, పువ్వాల పవిత్రన్, నిమ్మల మధు, శ్రీను. నాగరాజు, అనుమల రాంబాబు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

'రైతులపై చిన్నచూపు'

అశ్వారావుపేటరూరల్: ఆరుగాలం కష్టపడి పంటలు పండిస్తున్న రైతుల పట్ల బీఆర్ఎస్ ప్రభుత్వం చిన్నచూపు చూస్తోందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మొగళ్లపు చెన్నకేశవరావు అన్నారు. స్థానిక ఆ పార్టీ కార్యాలయం గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అకాల వర్షాలతో రైతులు పంట నష్టపోయి బాధ పడుతుంటే బీఆర్ఎస్ ప్రభుత్వానికి మాత్రం చీమకుట్టినట్లు లేదన్నారు. అకాల వర్షాలతో తడిసిన ధాన్యాన్ని తక్షణమే ప్రభుత్వం కొనుగోలు చేయాలని, ఎకరానికి రూ.20వేల వరకు పంట నష్టం ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో మండల కోఆప్షన్ సభ్యులు ఎస్‌కే పాషా, నాయకులు మేక అమర్‌నాథ్, జల్లిపల్లి దేవరాజు, ఎస్ బాలయ్య పాల్గొన్నారు.

తేమశాతం పరిగణించవద్దు


అశ్వాపురం: ధాన్యం తేమ శాతంతో సంబంధం లేకుండా తక్షణమే రైతుల ధాన్యం కొనుగోలు చేయాలని తెలంగాణ జన సమితి పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పగడాల కరుణాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. మండల పరిధిలోని మొండికుంటలో గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అకాల వర్షాలకు పంట నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలని, తడిసిన ధాన్యం వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ సచివాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి వినతిపత్రం అందజేయడానికి వెళ్తున్న టీజేఎస్ అధ్యక్షుడు కోదండరాం, రిటైర్డ్ ఐఏఎస్ ఆకునూరి మురళి, పలువురు నాయకులను అరెస్ట్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. తక్షణమే విడుదల చేయాలన్నారు.

ప్రజాపంథా ధర్నా

చర్ల: మండలంలోని సుబ్బంపేట గ్రామపంచాయతీ పరిధిలోని రాజయ్యనగర్‌లో అంగన్‌వాడీ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథాపార్టీ ఆధ్వర్యంలో గురువారం చర్లలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. చర్లలోని ఆ పార్టీ కార్యాలయం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ప్రదర్శనగా వచ్చిన రాజయ్యనగర్ గ్రామస్తులు.. అంగన్‌వాడీ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పార్టీ మండల కార్యదర్శి కొండా చరణ్ మాట్లాడారు. అనంతరం తహసీల్దార్ భరణిబాబుకు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు నందిని, నీలమ్మ, అనీల్, రమేష్, నాయకులు మునిగల శివ, కొక్కెరపాటి రవి తదితరులు పాల్గొన్నారు.

ముదిరాజ్ సంఘం మండల కమిటీ ఎన్నిక

అశ్వాపురం: మండల కేంద్రంలో గురువారం జరిగిన సమావేశంలో ముదిరాజ్ సంఘం మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పదిర రామచంద్రయ్య, ప్రధాన కార్యదర్శిగా తోట వెంకటనర్సయ్య, ఉపాధ్యక్షుడిగా కుంట రాజు, దంతాల జగదీష్, సహాయ కార్యదర్శిగా పదిర వీరభద్రం, సలహాదారులుగా పర్శబోయిన రాధాకృష్ణ, తోట సురేష్, నాగేశ్వరరావు, అడపా వీరభద్రం, రమేష్, గోల్కొండ కిరణ్, కోశాధికారిగా కుంట వీరభద్రం, సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాట్లాడుతూ. ముదిరాజ్‌ల అభ్యున్నతికి కృషి చేస్తామని, 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్క ముదిరాజ్‌కు సభ్యత్వాలు అందేలా కృషి చేస్తామని అన్నారు.



అటెన్షన్ ప్లీజ్

రోడ్డుపై నీరు.. స్థానికుల తిప్పలు

మండల కేంద్రంలో ప్రధాన రహదారిపై నీరు నిలుస్తుండడంతో స్థానికులు, వాహన దారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గతంలో ఇరువైపులా రోడ్డు వేయగా ఆ ప్రాంతంలో లోతట్టు ఏర్పడింది. దీనికితోడు డ్రెయినేజీ నిర్మాణం అసంపూర్తిగా వదిలేశారు. దీంతో వర్షం వస్తే నీళ్లన్నిరోడ్డుపైనే నిలుస్తున్నాయి. పలు మార్లు మట్టి పోసినా ఉపయోగం ఉండడంలేదు.

\- గుండాల



ప్రశ్నించాల్సిన అధికారి: శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి, గుండాల
ఫోన్ నంబర్: 9491324175

చోరీపై కేసు నమోదు

అశ్వారావుపేటరూరల్: ద్విచక్రవాహనం చోరీ ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై బి.రాజేశ్‌కుమార్ తెలిపారు. మండల కేంద్రంలోని మంగళి బజార్‌కు చెందిన అన్నవరపు హేమంత్ సాయిగిరీశ్ తన ద్విచక్రవాహనాన్ని గత నెల 14వ తేదీన ఇంటి వద్ద పార్కింగ్ చేశాడు. ఈ వాహనాన్ని గుర్తు తెలియని వ్యక్తులు అపహరించగా బాధితుడు గురువారం చేసిన ఫిర్యాదుతో కేసు నమోదైంది.

భద్రాచలంఅర్బన్: పట్టణంలోని అశోక్ నగర్ కొత్త కాలనీకి చెందిన రామకృష్ణ అనే వ్యక్తి ఈ నెల 2వ తేదీన తన ద్విచక్ర వాహనాన్ని స్థానిక మార్కెట్ వద్ద పార్కింగ్‌లో పెట్టి, తన కార్యక్రమాలను పూర్తి చేసుకు వచ్చి చూడగా తన వాహనం చోరీకి గురైనట్లు గుర్తించాడు. తెలిసిన వారిని అడగగా ఎటువంటి సమాచారం తెలియరాలేదు. ఈ క్రమంలో గురువారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు.

యువతి అదృశ్యం

అశ్వారావుపేటరూరల్: ఇంటి నుంచి వెళ్లిన ఓ యువతి తిరిగి రాకపోవడంతో ఆమె కుటుంబీకుల ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై బి.రాజేశ్‌కుమార్ తెలిపారు. మండల కేంద్రానికి చెందిన యువతి బుధవారం ఇంట్లో నుంచి వెళ్లి తిరిగిరాలేదు. ఎక్కడ ఆరా తీసినా ఆచూకీ లేకపోవడంతో ఆమె కుటుంబీకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

వేధింపుల కేసు నమోదు

దమ్మపేట: అనుమానంతో భార్యను వేధిస్తున్న వ్యక్తిపై పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. మండలంలోని దమ్మపేట మల్లారం కాలనీకి చెందిన బోయిన జలేందర్‌తో అదే గ్రామానికి చెందిన మాధవికి 2014లో వివాహమైంది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. వీరికి ఇద్దరు పిల్లలు. అయితే, కొంతకాలంగా జలేందర్ అనుమానిస్తూ భౌతికంగా వేధించడంతో మాధవి ఆయన తల్లిదండ్రులకు చెప్పిన పట్టించుకోలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఏఎస్సై ప్రతాప్‌రెడ్డి తెలిపారు.

విద్యుదాఘాతంతో పాడిఆవు మృతి

చండ్రుగొండ: మండలంలోని తుంగారం పంచాయతీ టేకులబంజర్‌లో రైతు బర్మావత్ సామకు చెందిన పాడిఆవు గురువారం విద్యుదాఘాతంతో మృతి చెందింది. ఉదయం మేతకు వెళ్లిన ఆవు తక్కువ ఎత్తులో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌కు తాకడంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృత్యువాత పడింది.

ఆలయానికి విరాళం

అశ్వాపురం: మండల పరిధిలోని సండ్రలబోడు గ్రామంలోని బండ్లసిరిగుట్ట వెంకటేశ్వర స్వామి నూతన ఆలయం నిర్మాణానికి అశ్వాపురంకు చెందిన భారజల కర్మాగారం టీఎన్‌టీయూసీ సీనియర్ నాయకుడు కూరపాటి శ్రీనివాసరావు, నాగేంద్రమ్మ దంపతులు గురువారం రూ.50 వేలు విరాళంగా ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు.

దేశ సంపదను లూటీ చేస్తున్న కేంద్రం



మణుగూరురూరల్: యువజన సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రేగా కాంతారావు

కరకగూడెం: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దేశ సంపదను లూటీ చేస్తూ ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటీకరణ చేస్తోందని ప్రభుత్వ విప్, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు అన్నారు. ఈ మేరకు ఆయన గురువారం మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ప్రశ్నించే గొంతుకను అణిచివేయడమే బీజేపీ ప్రభుత్వ లక్ష్యమని, ఇది ప్రజాస్వామ్యానికి పెను ప్రమాదమని ఆందోళన వ్యక్తం చేశారు. అభివృద్ధిలో తెలంగాణాకు సాటి మరే రాష్ట్రం లేదని, పినపాక నియోజకవర్గంలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి చేశానని అన్నారు. కార్యక్రమంలో మండల నాయకులు, పార్టీ శ్రేణులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యం కావాలి

మణుగూరురూరల్: రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ గెలుపే లక్ష్యంగా యువజన నాయకులు ముందుకు సాగాలని పినపాక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ రేగా కాంతారావు అన్నారు. గురువారం సమితిసింగారం గ్రామపంచాయతీలోని పద్మశాలిభవన్‌లో జరిగిన పినపాక నియోజకవర్గ గులాబీ యువసైన్యం విస్తృత సమావేశానికి ఎమ్మెల్యే రేగా కాంతారావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాబోయే ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి రావడం, కేంద్రంలో సీఎం కేసీఆర్ చక్రం తిప్పడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కార్యకర్తలందరికీ ఎల్లవేళలా తాను అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. సమావేశంలో బీఆర్ఎస్ యువజన విభాగ నియోజక వర్గ అధ్యక్షుడు మట్టపల్లి సాగర్, నియోజకవర్గ వర్కింగ్ ప్రెసిడెంట్ బోశెట్టి రవిప్రసాద్, రుద్ర వెంకట్, హర్ష నాయుడు, రంజిత్ కుమార్, యువజన కార్యకర్తలు పాల్గొన్నారు.

తెలంగాణ రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పినపాక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ రేగా కాంతారావు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. గురువారం పార్టీ మండల, పట్టణ కమిటీ బూత్ సమన్వయకర్తలతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్ హ్యాట్రిక్ విజయం సాధించేలా ప్రతీ కార్యకర్త సైనికుడిలా పని చేయాలని, ప్రతీ ఇంటికి తిరుగుతూ ప్రభుత్వ పథకాలను క్షేత్రస్థాయిలో ప్రచారం చేయాలని సూచించారు. సమావేశంలో మణుగూరు జెడ్పీటీసీ పోశం నరసింహారావు, బీఆర్ఎస్ నాయకులు ముత్యంబాబు, అడపా అప్పారావు, సంజీవరెడ్డి, యూసఫ్ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి



క్రీడాపోటీలు ప్రారంభిస్తున్న జీఎం రాంచందర్

మణుగూరుటౌన్: సింగరేణి కాలరీస్ కంపెనీ మణుగూరు ఏరియా ఆధ్వర్యంలో స్థానిక భద్రాద్రి స్టేడియంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణా శిబిరాన్ని ఉద్యోగుల పిల్లలు సద్వినియోగం చేసుకోవాలని ఏరియా జీఎం దుర్గం రాంచందర్ సూచించారు. గురువారం భద్రాద్రి స్టేడియంలో విద్యార్థులకు వేసవి క్రీడా శిక్షణా శిబిరాన్ని ఆయన ప్రారంభించి ప్రసంగించారు. సింగరేణి కుటుంబాల బాలబాలికలకు ఈ నెల 27వరకు పుట్‌బాల్, అథ్లెటిక్స్, వాలిబాల్, కరాటే, బాస్కెట్‌బాల్ విభాగాల్లో శిక్షణ ఉంటుందని తెలిపారు. 18 సంవత్సరాల లోపు ఉన్న సింగరేణి ఉద్యోగుల పిల్లలు దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం వివిధ క్రీడలను లాంఛనంగా ప్రారంభించారు. కార్యక్రమంలో ఏరియా డీజీఎం పర్సనల్ ఎస్.రమేష్, గౌరవ కార్యదర్శి డబ్ల్యూపీఎస్ అండ్ జీఏ వి.రామేశ్వరరావు, టీబీజీకేఎస్ డిప్యూటీ జనరల్ సెక్రటరీ అబ్దుల్ రవూఫ్, స్పోర్ట్స్ సూపర్‌వైజర్ జాన్‌వెస్లీ, కోచ్‌లు నాగరాజు, బన్ను, మురుగన్, ప్రేమ్‌కుమార్, సీనియర్ క్రీడాకారులు రామ్‌లాల్, వినయ్ సింగరేణి ఉద్యోగుల బాల బాలికలు తదితరులు పాల్గొన్నారు.

వారోత్సవాల పోస్టర్లు ఆవిష్కరణ



విద్యుత్ భద్రతా వారోత్సవాల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న అధికారులు

మణుగూరురూరల్: విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో విద్యుత్ వినియోగం, ప్రమాదాల నుంచి రక్షణ వంటి అంశాలతో ముద్రించిన విద్యుత్ భద్రతా వారోత్సవాల పోస్టర్లను భద్రాచలం డీఈ జీవన్ కుమార్ గురువారం ఆవిష్కరించారు. స్థానిక స్నేహ గార్డెన్స్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో డీఈ మాట్లాడుతూ.. విద్యుత్‌ను రైతులు, వినియోగదారులు పొదుపుగా వాడుకుని ఆదా చేసుకోవడం ద్వారా ఆర్థికంగా బలపడవచ్చన్నారు. ఆదా, రక్షణకు సంబంధించి పలు సూచనలు, సలహాలను వివరించారు. కార్యక్రమంలో విద్యుత్ అసిస్టెంట్ ఇంజనీర్లు శ్రీనివాస్, నరేందర్‌రెడ్డి, కావ్య, సబ్ డివిజన్ విద్యుత్ ఉద్యోగులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో పూజలు

అశ్వారావుపేటరూరల్: సాయిబాబా ఆలయాల్లో గురువారం భక్తులు పూజలు చేశారు. మండల పరిధిలోని వినాయకపురం, అశ్వారావుపేటలోని సాయిబాబా ఆలయాల్లో భక్తులు బాబాను దర్శించుకొని అభిషేకాలు చేసి, హారతులు పట్టారు. అన్న సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

చండ్రుగొండ: మండలంలో నేడు ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు పర్యటించనున్నట్లు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం బాధ్యులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 మద్దుకూరులో ప్రారంభమయ్యే పర్యటన దామరచర్ల, సీతాయిగూడెం, చండ్రుగొండ, రావికంపాడు, బెండాలపాడు గ్రామాల్లో కొనసాగుతుందని పేర్కొన్నారు. నూతనంగా నిర్మించిన సీసీరోడ్లను ఎమ్మెల్యే ప్రారంభిస్తారు.

విగ్రహ ప్రతిష్ఠలో ఎమ్మెల్యే

దమ్మపేట: మండల పరిధిలోని తాటిసుబ్బన్నగూడెం గ్రామంలోని రామాలయంలో గురువారం విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని వేద పండితులు విజయమారుతీ శర్మ ఆధ్వర్యంలో నిర్వహించగా.. స్థానిక ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు, మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావులు పాల్గొన్నారు. ఆలయ కమిటీ సభ్యులు వారికి ఘనంగా స్వాగతం పలికిన అనంతరం హోమం, ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పైడి వెంకటేశ్వరరావు, ఎంపీపీ సోయం ప్రసాద్, దారా మల్లికార్జునరావు, కొయ్యల అచ్యుతరావు, యార్లగడ్డ బాబు తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సమ్మేళనంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు..

దుమ్ముగూడెం: మండలంలోని లక్ష్మీనగరం గ్రామంలోని కే రేగుబల్లి బాలికల ఆశ్రమ పాఠశాలలో 2002–2003 విద్యాసంవత్సరంలో పదో తరగతి చదివిన బ్యాచ్ విద్యార్థులు గురువారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా అనాటి జ్ఞాపకాలను నెమరవేసుకుంటూ ప్రస్తుత వారి జీవిత విషయాలను పంచుకుంటూ సందడి చేశారు. ఆనాడు విద్యాబుద్ధులు నేర్పిన ప్రధానోపాధ్యాయుడు గోవిందరెడ్డి, ఇతర ఉపాధ్యాయులకు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు వెంకటలక్ష్మి, శాంతిచందన, గీత, వాణి, శ్రీదేవి, లక్ష్మి, మహాలక్ష్మి, నాగమణి, లింగమ్మ, సుజాత తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి



అన్నపురెడ్డిపల్లి: వీఓఏల సమ్మెకు మద్దతుగా సమ్మెలో కూర్చున్న కోనేరు సత్యనారాయణ

అన్నపురెడ్డిపల్లి: నిరవధిక సమ్మె చేస్తున్న వీఓఏల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కోనేరు సత్యనారాయణ డిమాండ్ చేశారు. అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రంలో వీఓఏలు చేపట్టిన నిరవధిక సమ్మెకు గురువారం ఆయన సంఘీభావం ప్రకటించి, కొద్దిసేపు సమ్మెలో కూర్చున్నారు. అనంతరం ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండ్లపల్లి శ్రీనివాసరావు, నాయకులు బాల వెంకటరెడ్డి, బాల కిరణ్, జుబ్బురు రమేష్, గొట్టిపాలు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

భద్రాచలంఅర్బన్: ఐకేపీ వీవోఏల నిరవధిక సమ్మె పట్ల ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలని శ్రామిక మహిళా పట్టణ కార్యదర్శి మర్లపాటి రేణుక, ఐకేపీ వీవోఏల సీనియర్ నాయకురాలు ధనలక్ష్మిలు కోరారు. 18వ రోజు గురువారం దీక్షలను వారు ప్రారంభించి మాట్లాడారు. దీక్షా శిబిరానికి వీవోఏల జిల్లా నాయకులు అరుణ, శ్రీను, గోపాల్‌లు హాజరై తమ మద్దతు తెలిపారు. వీవోఏల సంఘం పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు వెంకటలక్ష్మి, చంద్రలీల, సీతారత్నం, రాము, జానకి, శ్యామల, యశోద, పద్మ, రమాదేవి, విద్యా కుమారి, యశోద తదితరులు పాల్గొన్నారు.

ములకలపల్లి: వీఓఏల సమస్యలు పరిష్కరించాలని టీడీపీ అశ్వారావుపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ కట్రం స్వామి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం ములకలపల్లిలో వీఓఏల దీక్షా శిబిరాన్ని సందర్శించి, సంఘీభావం ప్రకటించారు. సంఘ జిల్లా అధ్యక్షురాలు దానం కనకలక్ష్మి, వీఓఏలు పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికులు..

మణుగూరుటౌన్: మణుగూరు ఏరియాలోని సింగరేణి, బీటీపీఎస్‌లలో వివిధ విభాగాల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలని మణుగూరు అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ రాజును జాతీయ వినియోగదారుల మానవ హక్కుల పరిరక్షణసమితి రాష్ట్ర ఉపాధ్యాక్షుడు మందడి సంజీవరావు కలిసి విన్నవించారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు బల్ల సందీప్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నాటు తుపాకులను అప్పగించాలి

గుండాల: వేటగాళ్లు, లేదా ఇతరులు వద్ద నాటు తుపాకులు ఉంటే వెంటనే స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అప్పగించాలని టేకులపల్లి సీఐ ఇంద్రసేనారెడ్డి సూచించారు. గురువారం ఆళ్లపల్లి పోలీస్‌స్టేషన్‌లో పరిధిలోని రాయిగూడెం గ్రామస్తులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అడవిలో వేటకు వెళ్లే వేటగాళ్లు తమ వద్ద పూర్వకాలం నాటి నాటు తుపాకులు ఎవరి దగ్గరైనా ఉంటే మూడు రోజుల్లో స్టేషన్‌లో ఇవ్వాలని సూచించారు. లేనిపక్షంలో కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అడవులలో అనుమానితులు ఎవరైనా కనిపించినా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. సమావేశంలో ఆళ్లపల్లి ఎస్సైలు రతీష్, అరుణ్ పాల్గొన్నారు.

ఘనంగా ధ్వజారోహణం

భద్రాచలం: భద్రాచల సీతారామ చంద్రస్వామి దేవస్థానానికి అనుబంధంగా ఉన్న శ్రీ యోగానంద లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో తిరుకల్యాణోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా గురువారం ధ్వజారోహణం భక్తి ప్రపత్తులతో జరిపారు. నరసింహస్వామి జయంతి సందర్భంగా అభిషేకం, ఉత్సవాలలో భాగంగా అగ్నిప్రతిష్ఠ, సాయంత్రం ఎదుర్కోలు ఉత్సవం, గరుడ వాహన సేవలను చేశారు. శుక్రవారం స్వామి వారి తిరుకల్యాణ మహోత్సవాన్ని జరిపేందుకు ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు.

నరసింహ జయంతి

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని శ్రీ అహోబిల మఠంలో నరసింహ జయంతి వేడుకలను గురువారం వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకుడు డాక్టర్ కృష్ణ చైతన్య స్వామి పలు పూజా కార్యక్రమాలు నిర్వహించి దశావతారాలలో నరసింహ అవతార ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో రుషి మహాసేవ వాహిని స్థాపకులు శ్రీధర్ స్వామి, భక్తులు పాల్గొన్నారు.

మాజీ సీఎంకు నివాళి

అశ్వారావుపేటరూరల్: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, స్వర్గీయ సర్దార్ జలగం వెంగళరావు జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. స్థానిక లక్ష్మీ శ్రీనివాస టాకీస్ ఆవరణలో జగలం యువసేన అధ్యక్షుడు చిక్కం గోపాలకృష్ణ ఆధ్వర్యంలో వెంకగళరావు చిత్ర పటానికి పూలమాల వేసి, ఘనంగా నివాళి అర్పించారు. ఫకీరయ్య, పుల్లయ్య, ఎస్‌కె.ముబారక్ బాబా, సత్యవరపు సంపూర్ణ, అప్పలరాజు, నాయుడు శ్రీను, ఈడా గోపి, హనుమంతరావు పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతకు సన్మానం

భద్రాచలంటౌన్: ఈ మధ్య కాలంలో హైదరాబాద్ రవీంద్రభారతిలో దళితరత్న అవార్డు అందుకున్న భద్రాచలం పట్టణవాసి తిరుమలపల్లి వెంకటేశ్వరరావును ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే పొదెం వీరయ్య గురువారం ఘనంగా సన్మానించారు. అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో దాసరి శేఖర్, సూరిబాబు, రాము, ప్రసాద్, దాసు, జయ, భూషణం, ఖాదర్ పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు వినతి

ములకలపల్లి: మండలపరిధిలోని చింతలచెరువు, తాటిమయ్యకుంట చెరువు అక్రమణపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆదిమ ఆదివాసుల సంక్షేమ, హక్కుల పరిరక్షణ సంఘం ఆధ్వర్యంలో గురువారం తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు మాట్లాడుతూ.. పాతూరు. అన్నారం గ్రామాల శివార్లలోని చెరువుల శిఖం భూములను కొందరు అక్రమార్కులు ఆక్రమించుకొన్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో సంఘ నాయకులు సోయం సత్యనారాయణ, సోయం బాబూరావు, ఊకే ముక్తేశ్వరరావు, బాడిశ భిక్షం, తాటి రవి, కోంద్రు పద్మ, రత్తమ్మ, లక్ష్మి తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ విప్‌కు..

మణుగూరురూరల్: మణుగూరు సబ్ డివిజన్‌లోని మండలాల పంచాయతీ కార్యదర్శులు గురువారం పినపాక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ రేగా కాంతారావును గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని ఎమ్మెల్యేకు అందజేశారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే రేగా.. సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

మాదిగ హక్కుల దండోరా అధ్యక్షుడిగా శ్రీను

అశ్వాపురం: మాదిగ హక్కుల దండోరా పినపాక నియోజకవర్గ అధ్యక్షుడిగా పినపాక మండలం టీ కొత్తగూడెం గ్రామానికి చెందిన జెర్రిపోతుల శ్రీనును నియమించారు. సంఘం రాష్ట్ర, జిల్లా నాయకుల ఆదేశాల మేరకు అశ్వాపురం ఎస్సీ కాలనీలో రాష్ట్ర యువసేన అధ్యక్షుడు గొల్లపల్లి నరేష్‌కుమార్ ఆధ్వర్యంలో గురువారం జరిగిన సమావేశంలో శ్రీనుకు నియామకపత్రం అందజేశారు. పడుదల శ్రీకాంత్, ఉప్పల్లి సాయి, కొమ్ము రాజు, గొల్లపల్లి శాంతయ్య, గంగమ్మ, లక్ష్మయ్య పాల్గొన్నారు.